


అల్లూరి సీతారామరాజు

కాఫీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాఫీ పండ్లు నేలకూలి రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయని, కాఫీ రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని కిటుముల సర్పంచ్ గెమ్మేలి రమణమ్మ కోరారు. వర్షాలు కారణంగా పండిన కాఫీ పండ్లు మెత్తబడి నేల రాలిపోతుండటంతో నేల పడిన కాఫీ పండ్లు సేకరించేందుకు గిరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. వర్షాలు కారణంగా ఈ ఏడాది కాఫీ రైతులు నష్టపోవడం జరిగిందని, కూటమి ప్రభుత్వం కాఫీ రైతులను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆమెఅన్నారు. కాఫీ చెట్టు నుండి కోసిన పండ్లు నాణ్యతగా ఉండి, కిలోలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ, నేలరాలిన పండ్లు కారణంగా నాణ్యతా ప్రమాణాలు కోల్పోయి, నాసిరకంగా దిగుబడి వచ్చిన ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. పాడేరు ఐటిడిఏ అధికారులు చొరవ తీసుకొని నేలరాలిన కాఫీ పండ్లను ప్రభుత్వం ప్రకటించిన ధరలతో కొనుగోలు చేసి నష్టపోయిన కాఫీ రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

జాతీయ రహదారి నిర్మాణంతో నష్టం వాటిల్లిన..

బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపోయిన లబ్ధిదారులకు వెంటనే నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి (దిశా) చైర్పర్సన్, అరకు ఎంపి జి తనూజా రాణి సూచించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన దిశా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లాలో గ్రామ గ్రామాన ప్రచారం కల్పించి అవగాహన కల్పించాలని సూచించారు. తాగు నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఇంటింటి కొళాయి కనెక్షన్లలో నిర్లక్ష్యం వహించరాదని కోరారు. జేజేఎం అమలును సమీక్షిస్తూ జిల్లలో రూ. 300 కోట్లతో 4,547 పనులు మంజూరయ్యాయని, వాటిలో రూ.143.84 కోట్లతో 3,362 పనులు పూర్తీ చేయడం జరిగిందని, మిగిలిన 1185 పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా 2,38,319 గృహాలకు గాను 1,20931 గృహాలకు ఇంటింటి తాగు నీటి సౌకర్యం కల్పించడం జరిగిందని, మిగిలిన 1,17,388 గృహాలకు త్వరితగతిన నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రిజర్వాయర్ల ద్వారా నీటి లభ్యతకు అనుకూల ప్రాంతాలను, ఊట నీటిని సరఫరా చేయడానికి గల అనుకూలతలను గుర్తించి డిపిఆర్ తయారు చేయాలని తీర్మానించారు. వైద్య ఆరోగ్య శాఖలో అమలు జరుగుతున్న పథకాల గూర్చి వివరించిన ఎంపి ఆయా లబ్ధిదారులకు అందుతున్న లబ్ధిపై ఆరా తీసారు. అదేవిధంగా సికిల్ సెల్ ఎనిమియా గూర్చి వివరిస్తూ 4,45,739 మందికి పరీక్ష చేయగా 1172 మంది సికిల్సెల్ ఎనిమియా భాదితులుగా గుర్తించడం జరిగిందని, అందులో 960 మందికి మాత్రమె పది వేల రూపాయలు చొప్పున ఫించన్ ఇస్తున్నారని, మిగిలిన వారికి ఫించన్ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. 2024-25లో మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 250 కోట్లు లక్ష్యానికి గాను రూ.304 కోట్ల విలువ గల పనులు పూర్తీ చేసి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడం వంద రోజుల పనిదినాల కల్పనలో కూడా మొదటి స్థానం సాధించడం శుభ పరిణామమని, ఇదే పంథాని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఎంపి ఆకాంక్షించారు. ప్రమాదాల నివారణకు జంగిల్ క్లియరెన్స్, కొండ చరియలు విరిగి పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించిన ఎంపి సోలార్ రూఫ్ టాప్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎం.జే అభిషేక్ గౌడ, అరకు, పాడేరు శాసన సభ్యులు రెగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వర రాజు, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, పలువురు ఎంపిపిలు, పలువురు జిల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి



వర్షాలకు నష్టపోయిన రాజ్మా పంటను చూపిస్తున్న గిరిజన రైతులు

పంట నష్టపరిహారం చెల్లించకుంటే ఆత్మహత్యలే శరణ్యం

ప్రజాశక్తి-సీలేరు

ఇటీవల తుఫాన్ల కారణంగా కురిసిన వర్షాలకు పంటలు కోల్పోయిన గిరిజన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, లేకుంటే తమ కుటుంబాలకు ఆత్మహత్యలే శరణ్యమని గిరిజన రైతు పలాస ఇరిమి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక వీడియో విడుదల చేశారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిసర గ్రామాల్లో రాజ్మా, మినుములు, కందులు, చిక్కుళ్ళు పంటలు పూర్తిగా వర్షాలకు మట్టిపాలై నాశనమయ్యాయని తెలిపారు. రాజ్మా, చిక్కులు కోత దశకు వచ్చే సమయంలో తుఫాను కొంపముంచిందని పేర్కొన్నారు. రాజమా చిక్కుళ్ళు భూమిలో మొలకలు వచ్చి పూర్తిస్థాయిలో పాడైపోయాయని తెలిపారు. పంట పూర్తిగా నాశనం కావడంతో కుటుంబ పోషణ కష్టతరం కానుందని వాపోయారు. ప్రభుత్వం, అల్లూరు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి తక్షణమే సంబంధిత అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే ఈ ఏడాది సెప్టెంబర్ 8న రాత్రి వరద బీభత్సానికి కాఫీ, వరి పంటలు కొట్టుకుపోయి భూములు ఎడారిగా మారాయని తెలిపారు. నాడు సందర్శించిన ఐటిడిఎ పిఒ అభిషేక్ రాజ్మా చిక్కుళ్ళకు ఇన్సూరెన్స్ ఉందని, కాఫీకి ఇన్సూరెన్స్ లేదని కాఫీ మొక్కలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పిఒ ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ ప్రోగ్రాస్, పీఎంఏవై, గ్రామీణ, పీఎం జన్మన్, డైలీ అటెండెన్స్, వాటర్ ట్యాంక్ క్లీనింగ్ తదితర అంశాలపై రివ్యూ చేపట్టారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొండలరావు

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం కేంద్రంలో రోజు రోజుకు పెరిగి పోతున్న గిరిజనేతరుల అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు స్థానిక తహశీల్దార్ ప్రకాష్ కు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వైస్ ఎంపీపీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మండల కేంద్రంలో గిరిజనేతరులు అక్రమ ఇల్లు, షాపులు, అంతస్తుల మేడలు కడుతున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, స్పందించి నిలుపుదల చేయాలని ఆయన కోరారు. 1/70, పెసా చట్టాలను తుంగలోకి తొక్కుతూ గిరిజనేతరులు అక్రమ కట్టడాలు కడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయమై తక్షణమే స్పందించిన తహశీల్దార్ అక్రమాల పై చర్యలకు ఉపక్రమించడానికి ఆదేశాలు ఇవ్వడం ఆనందకరమైన విషయమన్నారు. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే గిరిజన ప్రజలతో కలిసి రాబోయే రోజుల్లో భారీ ఉద్యమాలు, పోరాటాలు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాంగి లింగ మూర్తి, కర్రన్న, చీడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం లేక ..

గర్భిణులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామంలో బూరు ఈశ్వరమ్మ అనే గర్భిణీని ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు అవస్థలు పడ్డారు. స్థానిక ఆశ వర్కర్ కొర్రా సుజాత కొంతమంది గిరిజనులు సాయంతో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ కు ఫోన్ చేశారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని ఊరిదాకా రాలేమని, సగం వరకు పేషెంట్ ని తీసుకు రావాలని అంబులెన్స్ సిబ్బంది చెప్పారు. జీపులో తరలిస్తుండగా గంగూడి గ్రామం వద్ద జీపు మరమ్మతుకు గురైంది, కొంతసేపు తర్వాత అంబులెన్స్ రావడంతో ఆసుపత్రికి తరలించారు. మెటల్ వేసి వదిలేయడంతో రాళ్లు పైకి తేలి ఉండడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మధ్యలో జీపు మరమ్మతుకు గురవడంతో అవస్థలు పడుతున్న గర్భిణీ

తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి- చింతపల్లి : గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో ఆసుపత్రికి తరలి వెళ్లేందుకు రహదారి సౌకర్యం సౌకర్యం లేక గ్రామస్తులు డోలి కట్టి తరలించారు. గర్భిణీ గెమ్మేలి లక్ష్మమ్మ ను డోలి సహాయంతో సుమారు ఎనిమిది కిలోమీటర్లు మోసుకెళ్ళిన ఘటన మండలంలోని రాయిపాలెంలో చోటుచేసుకుంది. గర్భిణీ లక్ష్మమ్మ భర్త గెమ్మేలి శివ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మారుమూల కిటుముల పంచాయతీ రాయిపాలెం గ్రామానికి చెందిన గెమ్మేలి లక్ష్మమ్మ పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండగా కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఆమెను హుటహుటీన లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు రాయిపాలెం నుంచి పొలంబంధ మీదుగా రావిమానపాకలు తారు రోడ్డు వరకు సుమారు 8 కిలోమీటర్లు డోలి మోతతో తరలించారు., రావిమానపాకలు గ్రామం నుంచి లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఆటో సహకారంతో తరలించారు. లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించగా అధిక రక్తపోటు ఉండడంతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్ లో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు సుఖ ప్రసవం చేశారు.



డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు



ఆందోళన చేస్తున్న గిరిజనులు

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో సాగర పంచాయతీ గద్యగూడ గ్రామంలో వెంటనే బీటి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు గురువారం రోడ్డు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి వచ్చి ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటివరకు గద్యగుడ, పొడ్డగూడ గ్రామంలో రోడ్డు సౌకర్యం లేక ఆ గ్రామస్తులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బలిగడ్డ మీదుగా గద్యగూడ, పొడ్డగూడ వరకు సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మించి రవాణా కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు కేమ్ దాస్,గోవింద్,రాము,గ్రామస్తులు పాల్గొన్నారు.

జనవరి 31 నుంచి అరకు ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: జనవరి 31వ తేదీ నుండి మూడు రోజుల పాటు అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పర్యాటక మండలి. చైర్మన్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన పర్యాటక అభివృద్ధి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మారేడుమిల్లి ఉత్సవాలు ఫిబ్రవరి 23, 24, 25 తేదీలల్లో మారేడుమిల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అరకు, బొర్రా గుహలును ప్లాస్టిక్ ఫ్రీ డెస్టినేషన్ గా ప్రకటించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాలలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగం, కొనడం, అమ్మడం లాంటి వ్యవహారాలు నిషిద్ధమని స్పష్టం చేసారు. ఈ నిబంధనలు జనవరి ఒకటి నుండి అమలులోకి వస్తాయన్నారు. అరకు, మారేడుమిల్లి ఉత్సవాల నిర్వహణకు మూడేసి కోట్ల రూపాయలు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జె అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడి ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, డిఆర్ఓ పద్మలత, జిల్లా పర్యాటక అధికారి వి.దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి

ప్రజాశక్తి - చింతపల్లి: బడుగు, బలహీన వర్గాల నేత వంగవీటి మోహనరంగా వర్ధంతిని చింతపల్లి కాపుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడు దూనబోయిన రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చింతపల్లి మండల అధ్యక్షులు గాజుల శ్రీను, తాటిపాకల హరి, దూనబోయిన నాగు, తరుణ్, లోవ, దివాణం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

సిఐటియు ఆధ్వర్యాన రిలే దీక్షలు ప్రారంభం



పాడేరులో దీక్షలను ప్రారంభిస్తున్న సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు పడాల్

ప్రజాశక్తి -పాడేరు

రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, 10వేల వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఐటీడీఏ ఎదుట వాలంటీర్లు చేపట్టిన రిలే దీక్షలను గురువారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాలంటీర్లకు బకాయి పడ్డ 7 నెలల వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.వాలంటీర్ల మీద రాజకీయ కక్షలు వద్దని, రెండు లక్షల 50 వేల మంది నిరుద్యోగులు అన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత వైసిపి ప్రభుత్వం వాలంటీర్‌లతో వేట్టి చాకిరి చేయించుకుందన్నారు. ఎన్నికలలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సుందర్‌రావు, వార్డు గ్రామ వాలంటీర్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, కొండబాబు, మండల అధ్యక్షులు సురేష్ కుమార్,మండల ఉప అధ్యక్షులు సత్యారావు, వాసు, మండల కార్యదర్శి సింహాచలం, రమణ, మంజు, మౌనిక, వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదబయలు: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద గ్రామ వాలంటీర్లు రిలే దీక్ష లను ప్రాభించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి గిరిజన ప్రజానికానికి అనేక రకాలుగా ప్రజలకు సేవలు అందించారన్నారు.టిడిపి ప్రభుత్వం అధికారంలో వస్తే వాలంటీర్లకు నెలకు 10వేలు ఇస్తామని, కొనసాగిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటిస్తూ వాగ్దానాలు చేసిందన్నారు. అధికారం చేపట్టి కూటమి ప్రభుత్వం ఏడు నెలలు కావస్తున్నా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొండా గంగాధరం, వాలంటీర్ సంఘం పెదబయలు మండలం అధ్యక్ష కార్యదర్శులు, తాతబాబు, బంగారు పడాల్, ఉపాధ్యక్షులు కృష్ణారావు, సిహెచ్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి రాజు, రమణ, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద వాలంటీర్ల రిలే నిరాహార దీక్షను సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ దీక్షలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లను రెన్యువల్ చేసి యధావిధిగా విధుల్లో కొనసాగించాలన్నారు. బలవంతంగా రాజీనామాలు చేయించిన వాలంటీర్లను తిరిగి విధుల్లో తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను, గ్రామ సచివాలయ వాలంటరీ మండల అధ్యక్షులు దేవా పాల్గొన్నారు.

అరకులోయరూరల్ : కూటమి ప్రభుత్వం వాలంటీర్లు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అరకులోయ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ వాలంటీర్ల దీక్షను సిఐటియు మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ ప్రారంభించారు. వాలంటీర్ల వ్యవస్థను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల మండల అధ్యక్షులు వి మధు, కార్యదర్శి ఎస్.ఆనందరావు, జాను బాబు, రాజబాబు పాల్గొన్నారు.

అనంతగిరి : పోరాటంతోనే సమస్యలు పరిష్కార అవుతాయని, వాలంటీర్లు పోరాటాన్ని మరింత ఉధృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షకు మద్దతుగా జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం వాలంటీర్లతో వెట్టి చాకిరి చేయించుకుని అన్యాయం చేసిందని విమర్శించారు. తెలుగు దేశం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాలంటిర్ల నాయకులు . అప్పలరాజు, . రాజారావు, సన్యాసి రావు, .చిన్నారావు, బాలరాజు, నాగేశ్వరరావు శిరగం. బలరాం తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

వాలంటీర్ వ్యవస్థపై అసెంబ్లీలో చర్చించాలి

చింతూరు : గ్రామ/వార్డు వాలంటీర్ వ్యవస్థపై జనవరి 2వ తేదీ నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. తమను విధుల్లో కొనసాగించాలని కోరుతూ చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాల గ్రామ వాలంటీర్లు చింతురు ఐటీడీఏ ముందు సిఐటియూ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను వెంకట్‌తో పాటు సిఐటియు సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ఆదివాసి అడ్వకేట్ ఆత్రం నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వాలంటీర్లకు గౌరవేతనంగా రూ.10వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసిన చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా నేటికీ వారిని విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. పైగా ఉపముఖ్యమంత్రి, మంత్రులు అసలు వాలంటీర్ వ్యవస్థ అనేది లేదని మాట్లాడుతున్నారని, వ్యవస్థే లేకుంటే ఎవరి కోసం వాగ్దానాలు చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల 60 వేల మంది వాలంటీర్లు ఉన్నారని, వారి సమస్యలను పట్టించుకోని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి లడ్డు, షిప్‌లో ఉన్న బియ్యం గురించి మాత్రం మీడియా ముందు మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయనకు వాలంటీర్లు కనబడట్లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లను ఐక్యం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చింతూరు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్, నాయకులు కారం సుబ్బారావు. వాలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు పొడియం జానీ, నాయకులు కలుముల మహేష్, సోడి ప్రసాద్, పద్మావతి, శాంతి, కుమార్, జనార్ధన్ రెడ్డి, బద్రు, సోడి దుర్గారావు, రామిరెడ్డి, వనరాజ్, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

28న వాలంటీర్ల రిలే దీక్ష

దుంబ్రిగుడ : వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 28న మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు బి విజయ్ కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన వాలంటీర్ల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 పంచాయతీల వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు, కామరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.



పెదబయలులో నినాదాలు చేస్తున్న వాలంటీర్లు, గిరిజన సంఘం నేత సన్నిబాబు



అరకులోయలో దీక్షలను ప్రారంభిస్తున్న భగత్ రామ్



అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ దీసరి గంగరాజు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ త్రినాధ్

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పరిధి కర్లపొదొరు గ్రామంలో సర్పంచి కొర్ర త్రినాధ్ సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులు ఆరు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. గ్రామంలో వర్షా కాలంలో రాకపోకలకు తీవ్రమైన బురదతో అనేక ఇబ్బందులు పడేవారన్నారు. రోడ్డు నిర్మాణంతో గ్రామంలోని ప్రజలకు ఆ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సాధురం, వార్డు సభ్యులు గ్రామస్థులు వి.నీలకంఠం, కె.కమరాజు, కోమటి, సింహాద్రి, కాంట్రాక్ట్ ఉమ శంకర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో స్థానిక కాఫీ హౌస్‌లో ఈనెల 27న శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఎస్పీ ప్రమోద్ కుమార్‌లను రెడ్ క్రాస్ బృందం కోరారు. జిల్లాలో రక్తపు నిలువలు లేక పోవడంతో అత్యవసర సమయంలో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దానిని అధిగమించేందుకు జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశాల మేరకు అత్యవసర రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అన్ని శాఖల ఉద్యోగులు సహకరించాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అపోహలకు తావు లేకుండా విరివిగా దాతలు ముందుకు రావాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించి రక్తదాన శిబిరాలు విరివిగా ఆయా శాఖలవారీగా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.సభ్యత్వ నమోదు చేసుకుని రెడ్ క్రాస్ సొసైటీకి విరాళాలు అందించాలని దాతలకు కోరారు. జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సహాయ సహకారాలతో నూతన కార్యవర్గం ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రజలందరూ సహకరించి రెడ్ క్రాస్ సొసైటీని ఏజెన్సీలో మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగరాజు, కోశాధికారి సూర్యారావు, సభ్యులు రవి, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వందేభారత్ రైలు ప్రయాణికుల కోసం రైల్వేస్టేషన్ నుంచి నగర పరిధిలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపడానికి చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లను జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఆదేశించారు. విశాఖపట్నం, ద్వారకా బస్ స్టేషన్‌లో సిటీ ప్లాట్ ఫామ్‌లోని ప్రయాణికుల సౌకర్యార్థం అల్పాహార హోటల్, శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్ల ప్రయాణికుల సౌకర్యార్థం కూల్ డ్రింక్స్ షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రయాణికులు ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, పిబిఎంకె.రాజు, పర్సనల్ ఆఫీసర్, జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బివి.రమణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ హోదాలో బివి.రమణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు వైద్యులు, కెజిహెచ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్‌సి కుల గణనపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జి. జనార్దన రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను నేటి నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. గురువారం నుంచి ఈ నెల 31వ తేది వరకు దీనిపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. తరువాత జనవరి 6వ తేది వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ మేరకు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేది వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి వ్యవసాయం ఇతర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ డేటా పై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారు. వీటిని మూడు దశలలో తనిఖీ చేస్తారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ ఐ కి నివేదిస్తారు. వీటిని ఆర్ ఐ పునఃపరిశీలించి తహశీల్దారుకు రికమండ్ చేస్తారు. తర్వాత తహశీల్దార్ వీఆర్వో, ఆర్ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్ లో పొందుపరుస్తారు. పొందు పరచిన వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్ గా తనిఖీ చేయిస్తారు. ఈ సోషల్ ఆడిట్ ను కలెక్టరు, ఆర్డీవోలు పర్యవేక్షిస్తారు.

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతగిరి: శ్రామిక, కర్షక, కార్మిక బడుగు బలహీన వర్గాల అభ్యుదయానికై పాటుపడే ఏకైక దినపత్రిక ప్రజాశక్తిని అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు, మండల విద్యాశాఖ అధికారి కిల్లో బాలాజీ, టోకురు సీపీఎం సర్పంచ్ కిల్లో మొస్యులు కొనియాడారు. మండల కేంద్రంలో గురువారం ప్రజాశక్తి కేలండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులు ఉద్యోగులు, ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలు వెలికితీస్తూ పరిష్కార మార్గానికి తోడ్పడే పత్రిక ప్రజాశక్తి అన్నారు. ఈ దినపత్రికలో పనిచేసే విలేకరులు కూడా అంకితభావం పనిచేస్తూ ప్రజా సమస్యలపై మరింత ఎత్తి చూపుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆదివాసి జేఏసీ ప్రతినిధి పాంగి .రవీంద్ర, సీఐటీయు కె.రామకృష్ణ, ప్రజాశక్తి విలేఖరి జన్ని. రామన్న, గిరిజన సంఘం నాయకులు ఎస్.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పిటిసి సభ్యులు గంగరాజు తదితరులు

సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- చింతపల్లి : చింతపల్లిలో సిపిఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో ఘనంగా శత వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అంజలి శనివారం సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు, చింతపల్లి మండల ఉప సర్పంచ్ గంజారి రమణ, సీనియర్ నాయకులు పొత్తూరి చిన్నారావు, అప్పారావు, అరిగల అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ హనుమాన్ జంక్షన్‌లో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు కోడ త్రినాథ్ పార్టీ ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుంకర విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడే పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసువెళ్లి పరిష్కరించే విధంగా సిపిఐ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



చింతపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పొగమంచుతో ప్రమాదాలు

ప్రజాశక్తి-పాడేరు:ప్రస్తుత శీతాకాలంలో చలితో పాటు విపరీతమైన పొగమంచుతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా శాఖాధికారి లీలా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని నివారించడానికి పొగమంచులో ప్రయణాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒకవేళ తప్పనిసరిగా ప్రయనించ వలసి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయానికులను విజ్ఞప్తి చేసారు. ముఖ్యంగా మార్గంలో ఎడమవైపు మాత్రమే ప్రయాణించాలని సూచించారు. వాహన వేగాన్ని తగ్గించి నడపాలని, హజార్డ్స్ లైట్స్ ఆన్ చేసి ఉంచాలని, హెడ్ లైట్స్ లో (తక్కువ) బీం లోనే వెలిగించాలని, మలుపు తిరగడానికి 10 సెకండ్ల ముందే ఇండికేటర్ వేయాలని, విండ్షీల్డ్, రియర్ మిర్రర్‌ను క్లీన్ గా ఉంచాలని, ప్రయాణానికి సరిపడు సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. ఘాట్ రోడ్‌లో 40 కే యం పి హెచ్ మించి వాహనము నడుపరాదనీ, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. రాంగ్ పార్కింగ్ చేయరాదని, తప్పనిసరి పరిస్థితిలో ఇండికేటర్ వేసివుంచాలని, మత్తు పదార్ధాలు సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనము నడుపరాదని కోరారు.

కుసులువాడ మైనింగ్ తవ్వకాలు రద్దుచేయాలని... సిపిఎం సంతకాల సేకరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులువాడ మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దుచేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన కుసులువాడ, చిన్నయ్యపాలెం, ఇచ్చాపురం, రేగానిగూడెం గ్రామాల్లో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 28వ తేదీన కుసులువాడ పంచాయతీ సర్వే నెంబర్ 104 తెల్లకొండ (ఎద్దు కొండ)పై మైనింగ్ తవ్వకాల నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ మరలా నిర్వహిస్తున్నారని, దీన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన ప్రభుత్వాలే వారికి రక్షణ లేకుండా చేస్తున్నాయన్నారు. బ్లాస్టింగ్ రహిత అనుమతులంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టటానికి ప్రజలు సిద్ధం కావాలని, సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.నాగరాణి, శినగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

పర్యావరణానికి హాని కలిగించే మైనింగ్ తవ్వకాలను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం కుసులవాడ పంచాయతీలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు కుసులువాడ, చిన్నయ్యపాలెం ఇచ్చాపురం, రేగానిగూడెం తదితర గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రజలు, యువకులు, స్వచ్ఛంద సేవకులు, నాయకులు తరలిరావాలని కోరారు.

న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28వ తేదీన జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని జ్ఞానాపురంలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ వద్ద పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విప్లవకారుల ఐక్యతలో భాగంగా రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రధాన వక్తగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరౌతారని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ, ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బ తీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంలో కార్పోరేట్ విధానాలను అవలంభిస్తూ, దేశ సహజ సంపదనంతా వారికి దోచి పెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం నిత్య కృత్యంగా జరుగుతున్నాయన్నారు. ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులు అంతా ఐక్యమై ప్రజల తరుపున పోరాటం చేయాలన్నారు. నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీకి ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.నిర్మల, ఎస్.వెంకటలక్ష్మి, బి.గీత, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలకు కఠిన చర్యలు




మాట్లాడుతున్న సిఐ వరప్రసాద్

ప్రజాశక్తి-సీలేరు : గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అపరాల వ్యాపారులు తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీకే వీధి సిఐ వరప్రసాద్ హెచ్చరించారు. జీకే వీధి పోలీసు స్టేషన్‌లో గురువారం ఉదయం అపరాల వ్యాపారులతో సిఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల్లో గిరిజన రైతులు పండించిన కాఫీ, రాజ్‌మా, మినుములు, కందులు, చిక్కుళ్ళు, ఇతర పంటలను ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పి వారిని నమ్మించి, కొనుగోలు చేసేటప్పుడు వేయింగ్ మిషన్ల ద్వారా అక్రమ తూనికలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దళారీలు గిరిజనులను మోసం చేసినట్లు ఎవరు దృష్టికైనా వస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. వ్యాపారం చాటున గంజాయి వంటి మత్తు పదార్థాలు కొనుగోలు చేసి అక్రమ రవాణాలకు పాల్పడుతే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. దళారీలు తప్పుడు విధానాలకు స్వస్తి పలికి అమాయక గిరిజనులకు మోసం చేయకుండా ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేయాలని సూచించారు. ఎస్సై అప్పలసూరి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చింతూరు :మండల కేంద్రంలో ఆటో నడుపుకుంటూ మెడికల్ కాలనీలో జీవనం సాగిస్తున్న కిలో రమేష్ అనే యువకుడు అనారోగ్యం కారణంగా గురువారం ఉదయం మృతి చెందారు. బాధిత కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాదర్ ఖాన్, అఖిల్, ఎస్‌కే రియాజ్, ఎస్కే షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న జెకెసి ట్రస్ట్ ప్రతినిధులు

కాంట్రాక్టు వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి 6లోగా దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిషనర్ అఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మిషన్, ఎన్‌హెచ్ఆర్ఎం డైరెక్టర్ ఆదేశాలతో వైద్యఆరోగ్యశాఖలో మైక్రోబయోలజిస్ట్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, నిఖాస్ ఆపరేటర్, ల్యాబ్ అటెండెంట్, ఫార్మసిస్ట్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎంహెచ్ఓ డాక్టర్ పి జగదీశ్వర రావు ప్రకటనతో తెలిపారు. నేషనల్ టిబిఎండ్ ప్రోగ్రాం, నేషనల్ హెల్త్ మిషన్‌లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు cfw.ap.nic.in వెబ్‌సైటులో ఉంచారని, వచ్చేనెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు దాటిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించబోమన్నారు. అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెన్‌కో డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-సీలేరు :సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్ ఖండ్ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న డ్రైవర్లుకు ఏపీ జెన్కో 487 జీవో ప్రకారం జీతాలతో పాటు ఇతర బెనిఫిట్స్ జెన్కో కాంట్రాక్టర్ అందజేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు బ్రాంచ్ గౌరవాధ్యక్షులు ఎస్కే. సుభాన్, కన్వీనర్ ఎంవి.రమణ డిమాండ్ చేశారు. లేకుంటే జెన్‌కో కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సిఐటియు కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏపీ జెన్కో పరిధిలో గల షిఫ్ట్ తదితర వెహికల్స్‌లో విధులు చేపడుతున్న డ్రైవర్లకు జీవో ప్రకారం జీతం, ఇతర బెనిఫిట్స్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కిల్డ్ డ్రైవర్లకు నెలకి రూ.18,000 ఇవ్వాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు కేవలం రూ.8,500 నుంచి రూ.10వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని తెలిపారు. డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. ఏపీ జెన్కో నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ ఎర్న్ లీవ్, ఫెయిడ్ హాలిడే, టెర్మిల్ బెనిఫిట్స్, వీక్లీ ఆఫ్స్ తూచా తప్పకుండా అమలు చేయాల్సి ఉండగా, నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. ఏపీ జెన్కోలో 24 గంటల ఏసి వాహనంలో ముగ్గురు డ్రైవర్లను పెట్టుకోవాల్సి ఉండగా, ఒక డ్రైవర్‌తోనూ, రోజులో 12 గంటలు పని చేయాల్సిన వాహనానికి ఇద్దరు ఉండవలసి ఉండగా ఒక డ్రైవర్‌లోనూ కాంట్రాక్టర్ పని చేయిస్తున్నారని తెలిపారు. డ్రైవర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ కాంట్రాక్టర్లు సక్రమంగా కట్టకుండా నానా అవస్థలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు రావలసిన వీడియో పాయింట్స్ ఇతర బెనిఫిట్స్ కాంట్రాక్టర్ స్వాహా చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై జెన్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏపీ జెన్కో ఉన్నతాధికారులు స్పందించి డ్రైవర్లకు రావలసిన జీతాలతో పాటు ఇతర బెనిఫిట్‌లు అందజేసి ఈపీఎఫ్ ఈఎస్ఐ కాంట్రాక్టులు కట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సిఒఇల ద్వారా పరిశోధనలకు అవకాశం

గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం వంటి విద్యాసంస్థలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ) ద్వారా పరిశోధనలను చేపట్టడంతో పాటు ప్రభుత్వం నుంచి పరిశోధక నిధులను పొందవచ్చునని. ఐఇఇఇ వైస్‌చైర్మన్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యాసంస్థలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, పరిశోధన కేంద్రాల ఆవశ్యకతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొని, ఇంజనీరింగ్‌లో ఫోటోనిక్స్, క్వాంటమ్, క్రిప్టోగ్రఫి, క్యూబిట్స్, క్వాంటమ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక ప్రగతిపై విద్యార్థులు లోతైన అవగాహన కలిగి, నూతన ఆవిష్కరణలపై దృష్టి ఉంచాలని, పరిశోధనల ద్వారా ప్రగతిలో పాలు పంచుకోవాలని సూచించారు. ఐఇఇఇ సభ్యుడు డాక్టర్ అంబర్ బాజ్‌పాయ్ కృత్రిమ మేధతో పాటు సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. కార్యక్రమంలో ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఐఇఇఇ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కె.ఎమ్.చిష్టి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.సూరిబాబు, ఐఇఇఇ విద్యార్థి అధ్యక్షురాలు నవ్యశ్రీ పాల్గొన్నారు.



ప్రత్యేక కార్యక్రమంలో గీతం ఐఇఇఇ విద్యార్థులు

సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా

పిఎం సూర్యఘర్‌పై అవగాహనలో ఎస్ఇ శ్యాంబాబు

ప్రజాశక్తి -ఆనందపురం: ఇంటింటా సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటుతో కరెంట్‌బిల్లుల ఆదాతోపాటు, ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు ఇంకెన్నో ప్రయోజనాలున్నాయి ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎస్ఇ జి.శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని గంభీరం గ్రామంలో పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు.సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు, సోలార్ విద్యుత్ యూనిట్ల కోసం వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లీడ్‌మేనేజర్ శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, డిపిఒ శ్రీనివాసరావు, జోన్ -3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇ రాజశేఖర్, ఎఇఇ సురేష్ కుమార్, ఎంపిడిఒ డాక్టర్ జానకి, మాజీ సర్పంచ్ వాసుపల్లి ముత్యాలరావు , ఇఒపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు

'పరీక్ష పే చర్చ'కు ప్రశ్నలు పంపండి

ప్రజాశక్తి -మధురవాడ : పరీక్ష పే చర్చలో పాల్గొనేందుకు ప్రధాని మోడీకి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రశ్నలు పంపించాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి సూచించారు. గురువారం పాఠశాలలో పరీక్ష పే చర్చ 2025 ప్రచార పోస్టర్లనుఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులతోపాటు ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులు మొబైల్ ఫోనులో పరీక్ష పే చర్చలో రిజిస్టర్ అయ్యి పరీక్షలపై ప్రశ్నలను పంపించాలన్నారు. విద్యార్థులు పరీక్షలలో తాము అవలంబిస్తున్న విధానాలు, పరీక్షల సంస్కరణలు, ఒత్తిడి నివారణ, కష్టతరమైన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంలో ఇబ్బందులు తదితర అంశాలపై ప్రశ్నలను పంపవచ్చన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద తల్లిదండ్రులతో మొబైల్ ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేయించి వారి ద్వారా ప్రశ్నలను పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, నాగేశ్వర రావు, కె శ్రీను, విజయకుమార్, సూర్యకుమారి పాల్గొన్నారు.

టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-దేవీపట్నం :ఏజెన్సీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా టేకు కలప తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తమకు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని కమలపాలెం ఊరి చివర కాపుకాసి టేకు దుంగలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేస్తామన్నారు. వీటి విలువ సుమారు రూ.10,000 ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో అక్రమ కలప రవాణాపై ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షణలో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.



అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :మండలంలోని దూసరపాము, చెరుకుంపాలెం పంచాయతీల పరిధి బోర్నగూడెం, చెరుకుంపాలెం గ్రామాలలో గురువారం తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. సుబ్బంపాడు, ఎర్రంపాడు గ్రామాలలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ చెల్లయ్యమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. భూ సమస్యలు, మ్యుటేషన్‌పై రైతుల నుండి అర్జీలు వచ్చినట్లు ఆర్ఐ చెల్లయ్యమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిడి శివ, విఆర్వో ఆన్నిక శ్రీనివాసు, సర్వేయర్లు రాంబాబు, అప్పన్న రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మారెమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-సీలేరు :జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారికి తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణానికి చెందిన కురసాల సాయి వినీల్ కాంత్, జస్విని దంపతులు సుమారు రూ.24 వేలు విలువ చేసే 200 గ్రాములు వెండి కిరీటాన్ని గురువారం ఉదయం బహూకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇంతకుముందు ఇదే దంపతులు దారాలమ్మ అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరించి భక్తిని చాటుకున్నారు. ఏపీ జెన్కో రిటైర్డ్ ఉద్యోగి గణేష్ దంపతులు పాల్గొన్నారు.



మారెమ్మకు వెండి కిరీటం ఇస్తున్న వినీల్‌కాంత్, జస్విని దంపతులు